నమస్తే తెలంగాణ
# వరంగల్
3 | వరంగల్, ఆదివారం 9 మార్చి 2025 | WARANGAL


ప్రమాదానికి ముందు కూతురు, భార్యతో కలిసి సెల్ఫీ తీస్తున్న ప్రవీణ్‌కుమార్


ఆటోషోకు వచ్చిన సందర్శకులతో సందడిగా హయగ్రీవాచారి గ్రౌండ్


కాలువలో నుంచి కారును బయటకు తీస్తున్న గ్రామస్తులు, ఘటనా స్థలం వద్ద గుమిగూడిన జనం


ప్రవీణ్‌కుమార్, సాయి చరిత, హర్షవర్ధన్ (ఫైల్)

# సెలవులకని వెళ్తూ.. అనంతలోకాలకు

## ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- తండ్రి, ఇద్దరు పిల్లలు మృతి.. తల్లిని కాపాడిన స్థానికులు
- పర్వతగిరి మండలం కొంకపాక శివారులో ఘటన
- నెల్లికుదురు మండలం మేచరాజుపల్లిలో విషాదం
- ఒక్కరోజే రెండు వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృత్యువాత

*రెండో శనివారం, ఆదివారం* సెలవులను స్వగ్రామంలో సంతోషంగా గడుపుదామని భర్త, భార్య ఇద్దరు పిల్లలు ఆనందంగా కారులో బయలు దేరారు.. ఆ సంతోషం ఎంతోసేపు నిలువలేదు.. వరంగల్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే వారిలో ముగ్గురు మృత్యు కౌగిలికి చేరుకున్నారు. వేగంగా వస్తున్న కారు మార్గమధ్యంలో అదుపు తప్పి ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లడంతో భర్త, ఇద్దరు పిల్లలు జల సమాధి కాగా, భార్య ఒక్కతే ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులో శనివారం చోటు చేసుకోగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లిలో విషాదం నింపింది. ఇలాంటి ఘటనే నాలుగేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో చోటు చేసుకుంది. కారు కెనాల్‌లో పడగా ప్రధానోపాధ్యాయురాలుతో సహా ముగ్గురు మృతిచెందగా, మరొకరు ఈదుకుంటూ బయటకు వచ్చారు. *- పర్వతగిరి/నెల్లికుదురు, మార్చి 8*

కారు అదుపుతప్పి ఎస్సారెస్పీ కెనాల్‌లోకి దూసుకెళ్లగా తండ్రి, ఇద్దరు పిల్లలు మృతి చెందగా, తల్లి ప్రాణాలతో బయటపడిన ఘటన పర్వతగిరి మండలం కొంకపాక శివారులో శనివారం జరిగింది. పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్‌ఐ బోగం ప్రవీణ్, స్థానికులు, బంధువుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మేచరాజుపల్లికి చెందిన సోమారాపు సారంగపాణి-పద్మ దంపతుల చిన్న కుమారుడు సోమారపు ప్రవీణ్‌కుమార్ (30) వరంగల్‌లోని ఎల్‌ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో భార్య కృష్ణవేణి, సాయి చైత్ర (5), హర్షవర్ధన్ (2)తో కలిసి సొంతూరుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కారు మార్గమధ్యంలోని కొంకపాక శివారులోకి రాగానే ప్రవీణ్‌కుమార్ ఛాతిలో నొప్పి వస్తున్నదంటూ ఆసుపత్రి వెళ్లడానికి కారును యూటర్న్ చేసి తిరిగి వరంగల్ వైపు వస్తున్నాడు. కొద్ది దూరం రాగానే కారు అదుపుతప్పి ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లింది. వెంటనే ప్రవీణ్ భార్య కృష్ణవేణి కారు డోరు తెరిచి కుమారుడు హర్షవర్ధన్‌ను బయటకు విసిరి తాను కూడా దూకింది. కారుతో పాటు ప్రవీణ్‌కుమార్, చైత్ర కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న స్థానికులు కృష్ణవేణిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. కొట్టుకుపోతున్న హర్షవర్ధన్‌ను అక్కడున్న వారు నీటిలో నుంచి బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని గల్లంతైన కారుతో పాటు ప్రవీణ్, చైత్రను వెతికేందుకు సుమారు మూడు గంటలసేపు శ్రమించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు కారుతో పాటు అందులోనే మృతి చెందిన ప్రవీణ్‌కుమార్, సాయి చైత్రను వెలికి తీశారు. ఈ వార్త తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులు సారంగపాణి, పద్మతో పాటు గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని బోరున విలపించారు. ఒకే రోజు రెండు వేర్వేరు ఘటనల్లో మేచరాజుపల్లికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉదయమే గ్రామానికి చెందిన ఇద్దరు చేపల వేటకు వెళ్లి మృతి చెందారు. కాగా, ఘటనాస్థలానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు చేరుకొని మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మామునూరు ఏసీపీ తిరుపతి సంఘటనా స్థలాన్ని సందర్శించారు.


మృతిచెందిన కుమారుడిని ఎత్తుకొని రోదిస్తున్న తల్లి కృష్ణవేణి

### మనువడిని భద్రంగా చూసుకుంటనంటివి కదమ్మా..

'మనవడి కోసం వచ్చావా అమ్మా.. భద్రంగా చూసుకుంటానంటివి కదమ్మా.. నీ మనవడిని ఆ దేవుడే తీసుకెళ్లిండే' అంటూ ప్రమాదం నుంచి బయటపడిన కృష్ణవేణి తన అమ్మను పట్టుకొని బోరున విలపించింది. ఆ తల్లి రోదనలు విని అక్కడున్న వారందరూ కంటతడి పెట్టారు.

## నాలుగేళ్ల క్రితం ఇదేచోట..

### మృత్యు మార్గంగా కెనాల్ రోడ్డు


మేచరాజుపల్లిలో మృతుడి ఇళ్లు

సంగెం, మార్చి 8 : సంగెం మండలంలోని తీగరాజుపల్లి ఎస్సారెస్పీ కెనాల్ రోడ్డు మృత్యు మార్గంగా మారింది. వరంగల్ నుంచి పర్వతగిరి వెళ్లేందుకు ప్రధానరోడ్డు, కెనాల్ నుంచి షాపురం వెళ్లేందుకు మరో దారి, గుడితండాకు వెళ్లేందుకు ఇంకోదారి.. ఇలా నాలుగు వైపులా అక్కడి నుంచే వెళ్లాలి. తీగరాజుపల్లి నుంచి పర్వతగిరి వెళ్లే దారిలోనే ఎస్సారెస్పీ కాలువ వద్ద మూలమలుపు ఉంది. ఇక్కడే వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి అందులో ప్రయాణిస్తున్న వారు ప్రాణాలు కోల్పోతున్నారు. నాలుగేళ్ల కిత్రం ఫిబ్రవరి 10, 2021న వరంగల్ నుంచి వస్తున్న కారు ఇదే కెనాల్‌లో పడిపోయింది. అప్పుడు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలుతో సహా ముగ్గురు మృతి చెందగా, ఒకరు ఈదుకుంటూ వచ్చి ప్రాణాలతో బయటపడ్డాడు. అదే ప్రాంతంలో అలాంటి ఘటనే పునరావృతమైంది. ఈ ఘటనలో కూడా ముగ్గురు మృత్యువాత పడగా, ఒకరు క్షేమంగా బయటకు వచ్చారు. అయితే కెనాల్ వద్ద ఏదో ఒక శక్తి ఉందని, అందువల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తీగరాజుపల్లి గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కెనాల వద్ద రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అతికించాలని పలువురు సూచిస్తున్నారు.

# ఆటోషో అదరహో..

## ప్రజల నుంచి విశేష స్పందన

- నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో కార్యక్రమం
- ప్రారంభించిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్
- కొలువుదీరిన అత్యాధునిక కార్లు, బైక్‌లు
- సందర్శకులతో సందడిగా కుడా హయగ్రీవాచారి మైదానం
- నేడూ కొనసాగనున్న ఆటోషో

- వివరాలు 13వ పేజీలో..

*అత్యాధునిక హంగులు..*

కొంగొత్త ఫీచర్లు.. చూడగానే ఆకట్టుకునే రంగులు.. ఇంకా మరెన్నో ప్రత్యేకతలున్న కార్లు, బైక్‌లు వాహనప్రియులను ఎంతో ఆకట్టుకున్నాయి. నగరవాసుల సౌలభ్యం కోసం 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో అన్ని కంపెనీల వాహనాలను ఒక్కచోట చేర్చి నిర్వహించిన ఆటోషోకు విశేష స్పందన వచ్చింది. ఆయా కంపెనీల యాజమాన్యాలు స్పెషల్, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, భారీ డిస్కౌంట్లతో పాటు ప్రస్తుతం ఎంతో క్రేజ్ ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను పరిచయం చేయగా నగరవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చి సందర్శించారు. తమకు నచ్చిన కార్లు, బైక్‌లను గురించి తెలుసుకోవడంతో పాటు టెస్ట్ డ్రైవ్ చేసి, మరికొందరు అక్కడికక్కడే బుక్ చేసుకున్నారు. ఉదయం 10 గంటలకు మొదలై.. రాత్రివరకూ వచ్చివెళ్లే సందర్శకులతో హయగ్రీవాచారి మైదానంలో సందడి నెలకొంది. ఆటోషోకు వచ్చిన సందర్శకుల నుంచి లక్కీడీప్ ద్వారా బహుమతులు అందించగా రేపు(ఆదివారం) కూడా ఆటోషో కొనసాగనున్నది. త్వరపడండి.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. *- హనుమకొండ చౌరస్తా, మార్చి 8*

# ఆకేరులోకి నీరు విడుదల చేయాలి

## ఎండిన వరి పంటతో రైతుల నిరసన


ఎండిన వరి పంటతో నిరసన తెలుపుతున్న కస్నాతండా రైతులు

తొర్రూరు, మార్చి 8 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కస్నతండా సమీపంలోని ఆకేరు వాగులో నీరు లేకపోవడంతో వరి పొట్ట దశలోనే ఎండిపోతున్నది. ఈ నేపథ్యంలో శనివారం రైతులు ఆకేరు వాగులోఎండిన పంటను పట్టుకొని నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వాగులో ఎప్పుడూ నీరు ఉండేదని, దీంతో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని గుర్తు చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి తక్షణమే స్పందించి ఆకేరు వాగులోకి నీటి విడుదల కోసం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.




# చేపల వేటకు వెళ్లి..

## కుంటలో మునిగి ఇద్దరు మృతి


బాదవత్ శేఖర్


భూక్యా రాములు(ఫైల్)

నెల్లికుదురు : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి ఇద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి శివారు పెద్దతండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు కథనం మేరకు.. తండాకు చెందిన బాదావత్ శేఖర్ (21), భూక్యా రాములు (45) కలిసి శుక్రవారం మధ్యాహ్నం మేచరాజుపల్లి శివారు కుమ్మరికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపల కోసం వేసి న వలను బయటకు లాగుతుండగా ప్రమాదవశాత్తు శేఖర్ గుంతలో పడి మునిగి పోతుండగా, అతడిని కాపాడేందుకు రాములు యత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరు నీటిలో మునిగి మృతి చెందారు. రాత్రి 9 గంటలైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు, తండావాసులు కుంట వద్దకు వెళ్లి వెతకగా అక్కడ వారిద్దరి బట్టలు, చెప్పులు కనిపించాయి. సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తే ఎవరూ మాట్లాడకపోవడంతో తండావాసులు గుంతలో వెతకగా ఇద్దరి మృత దేహాలు లభ్యమయ్యాయి. మృతుడు బాదావత్ శేఖర్ తండ్రి భద్రు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఎల్కతుర్తి వద్ద మరొకరు గల్లంతు..


సలీంపాషా (ఫైల్)

ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు మహమ్మద్ సలీంపాషా (24) శనివారం ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహమ్మద్ చోటేమియాకు నలుగురు కుమారులుండగా, ఇందులో దివ్యాంగుడైన మూడో కొడుకు సలీంపాషా శనివారం కాకతీయ కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కెనాల్‌లో జారిపడి గల్లంతయ్యాడు. సలీంపాషా ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి తన మిగతా కుమారులకు విషయం తెలుపగా వారు కెనాల్ వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, నిక్కరు కనిపించాయి. ఈ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వగా, ఎస్సై తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సలీంపాషా ఆచూకీ కోసం కెనాల్ వెంట రాత్రి వరకు వెతికినప్పటికీ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అతడి ఆచూకీ లభించలేదు.




# మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- అందుకోసమే కమ్యూనిటీ మధ్యవర్తిత్వ చట్టం
- మధ్యవర్తులుగా శిక్షణ పొందిన కుల పెద్ద మనుషులు
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్
- కాళోజీ కళాక్షేత్రంలో జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్

వరంగల్ లీగల్, మార్చి 8: ఒకప్పుడు గ్రామాల్లో సమస్యలు వస్తే కుల, గ్రామ పెద్దలు పరిష్కరించే వారని, ఇప్పుడు కూడా ప్రతి చిన్న తగాదాకు కోర్టు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా వారి మధ్యలో పరిష్కరించుకుంటే డబ్బుతో పాటు సమయం వృథా కాదని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు. అందుకోసమే కమ్యూనిటీ మధ్యవర్తిత్వ చట్టం వచ్చిందన్నారు. శనివారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 'కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సుజయ్ పాల్ హాజరై మాట్లాడారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రంలో మధ్యవర్తులుగా ఉండే కుల పెద్దలు శిక్షణ పొంది ఉంటారని, అందువల్ల ఇరుపక్షాలు పరస్పర ఆమోదయోగ్యమైన రీతిలో వివాదాన్ని పరిష్కరించుకొనే వీలుంటుందన్నారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కార్యక్రమం అన్ని గ్రామాల్లో అమలవుతుందన్నారు. మధ్యవర్తులుగా పనిచేసేందుకు వరంగల్ జిల్లా నుంచి అన్ని కులాల పెద్దలు, అనుభవజ్ఞులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపినందుకు చీఫ్ జస్టిస్ కృతజ్ఞతలు తెలిపారు. మరో హైకోర్టు న్యాయమూర్తి కే లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 5.30కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయని, ఇందులో రాష్ట్రంలో 9 లక్షలున్నాయన్నారు. ఎలాంటి ఒత్తిడికి తావివ్వకుండా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ ద్వారా జస్టిస్ మౌసమి భట్టాచార్య మాట్లాడుతూ వరంగల్ వేదికగా లోక్ అదాలత్ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. లోక్ అదాలత్‌లో కౌన్సెలింగ్ ద్వారా సమస్య పరిష్కరించుకున్న భార్యా భర్తను పిలిచి న్యాయమూర్తులు మళ్లీ పూలదండలు మార్పించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు, మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి, వరంగల్, హనుమకొండ, ములుగు, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పీ ప్రావీణ్య, డాక్టర్ టీఎస్ దివాకర, షేక్ రిజ్వాన్ బాషా, అద్వైత్ కుమార్‌సింగ్, రాహుల్ శర్మ, వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, మానుకోట, భూపాలపల్లి ఎస్పీలు సుధీర్ రామ్‌నాథ్ కేకన్, కిరణ్‌ఖరే, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టీ జీవన్ గౌడ్, ఎం రమేశ్‌బాబు, బార్ కౌన్సిల్ మెంబర్ సిరికొండ సంజీవరావు, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.